సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ׀ 30 ׀ డిసెంబర్ ׀ 2023



బాలికల పోరు భళా..

గిరిజన బాలికల గురుకులాల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం రెండోరోజుకు చేరాయి.

10లో



ఉన్న ఆధార్‌కార్డుతోనే..

ప్రస్తుతం ఉన్న ఆధార్‌కార్డుతోనే ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు.

10లో

గరిష్టం / కనిష్టం
30° / 18°

వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రి వేళ చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, కుంకుమపూజ, గణపతిహోమం జరిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనికుమారి, ఆలయ పాలకవర్గ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

- మణుగూరులో బీటీపీఎస్ సందర్శన



హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు రూరల్: డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక, ఇందనశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరనున్న ఆయన 11.10గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు చేరుకుంటారు. అక్కడ ప్లాంట్‌ను పరిశీలించి అధికారులతో సమావేశమవుతారు. ఆతర్వాత ఎర్రుపాలెం మండలం జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని పూజ లు చేశాక ఎర్రుపాలెం మండలంలో మిషన్ భగీరథ పథకంపై అధికారులతో సమీక్షిస్తారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటన నేపథ్యాన మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని హెలీప్యాడ్‌ను భద్రాచలం ఆర్‌డీఓ మంగీలాల్, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు తదితరులు పరిశీలించారు.


ప్రజాపాలన ప్రత్యేక అధికారికి స్వాగతం



స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఇల్లెందురూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాపాలన ప్రత్యేకాధికారి రఘునందన్‌రావు శుక్రవారం జిల్లాకు రాగా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జినుగు మరియన్న పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రఘునందన్‌రావు ఇల్లెందు మండలం సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ గ్రామసభను సందర్శించి పరిశీలించారు.

ఎన్నికల వ్యయ వివరాలు అందించాలి



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులందరూ విధిగా తమ వ్యయ వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని వ్యయపరిశీలకులు సంజీబ్‌కుమార్ పాల్, అజయ్‌లాల్‌చంద్ సోనేజీ సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఐదు నియోజకవర్గాల ఏఈఓలు, అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అభ్యర్థులంతా తాము చేసిన ఖర్చులు బ్యాంకు బుక్, డేటుడే రిజిస్టర్, క్యాష్ బుక్‌లలో నమోదు చేయాలన్నారు. ఈ నెల 31 లోపు అభ్యర్థులు ఖర్చుల నివేదికలను ఎన్నికల వ్యయ అధికారులకు అందజేసి క్లియరెన్స్ సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించారు. గడువు తేదీలోగా నివేదికలు సమర్పించని అభ్యర్థులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు ఎస్.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రెడ్డి, సంజీవరావు, సీతారాం పాల్గొన్నారు.

ఒడిదుడుకుల పయనం

- నదుపాయాలు మెరుగైనా.. ఫలితాల్లో వెనుకబాటు
- ఎట్టకేలకు ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు
- పదో తరగతిలో 78 శాతం ఉత్తీర్ణత నమోదు
- జిల్లాలో ముగ్గురు డీఈఓల మార్పిడి
- అన్ని పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ



సమగ్రశిక్షా అభియాన్‌లో ఉద్యోగ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ(ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో నదుపాయాలు మెరుగుపడుతున్నా ఫలితాల్లో మాత్రం జిల్లా విద్యాశాఖ వెనుకబడింది. 2023–24 సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో జిల్లా 78 శాతమే ఉత్తీర్ణత సాధించింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత తగ్గింది. సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉండటం, ఒక్క ఉపాధ్యాయుడే రెండు, మూడు సబ్జెక్టులు బోధించడం వంటి సమస్యలతో సిలబస్ పూర్తికాలేదని, ఆ ప్రభావం ఫలితాలపై పడిందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మన ఊరు– మన బడి, ఉపాధ్యాయ బదిలీలు

జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి అభివృద్ధి కార్యక్రమాల పనులు ఇంకా కొనసాగుతున్నాయి. సంవత్సర కాలంలో జనవరి నుంచి మొదలుపెడితే డిసెంబర్ వరకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు, డీఈఓల మార్పులు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ, పదో తరగతి పరీక్షలు, ఇంటర్మీడియట్ పరీక్షలు, ఓపెన్ పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షలు, వేసవిలో ఒంటిపూట బడులు, వేసవి సెలవులు, మళ్లీ బడులు పండుగ వాతావరణంలో పునఃప్రారంభం వంటివి జరిగాయి. విద్యార్థులకు ఉపయోగపడే పౌష్టికాహారం కార్యక్రమం, రాగిజావ, తొలిమెట్టు వర్క్ బుక్స్ పంపిణీ, ఇతర ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు ప్రమోషన్లపై జిల్లాకు రావడంతో నదుపాయాలు మెరుగయ్యాయి. బిల్లులు రావడం లేదని మధ్యాహ్న భోజన పథక కార్మికులు కలెక్టర్, డీఈఓలకు వినతిపత్రాలు సమర్పించడంతోపాటు పలుమార్లు ఆందోళన చేపట్టారు.



జనవరి నుంచి డిసెంబర్ వరకు కార్యక్రమాలను పరిశీలిస్తే..

- జనవరిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి.వెంకటనర్సమ్మ జిల్లాను సందర్శించి జిల్లా విద్యాధికారులకు పదోన్నతులు, బదిలీలపై సూచనలు చేశారు.
- జనవరిలో బదిలీలు, పదోన్నతుల కోసం హైదరాబాద్ నుంచి మోడల్ స్కూల్స్ రాష్ట్ర కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్.ప్రసాద్ జిల్లా నూతన డీఈఓగా బాధ్యతలు చేపట్టారు.
- ఫిబ్రవరి 15న పదో తరగతి విద్యార్థులకు అల్పాహార కార్యక్రమం ప్రారంభమైంది.
- ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మొదలయ్యాయి.
- పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచిపోవడంతో ఫిబ్రవరిలో ఇ.సోమశేఖరశర్మ మళ్లీ డీఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టారు.
- మార్చి 15వ తేదీ నుంచి పాఠశాలలకు ఒక్కపూట బడులు ప్రారంభయ్యాయి.
- మార్చిలో పాఠశాలల్లోని బాలికలను వేధిస్తున్నారని జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులపై వేర్వేరు ఘటనల్లో కేసులు నమోదయ్యాయి.
- ఏప్రిల్ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అదే నెల 25 నుంచి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి.
- మే 10న పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 12,481 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 9,801 మంది ఉత్తీర్ణులుగా కాగా, 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- మే 14 నుంచి 20వ తేదీ వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి.
- జూన్ 12వ తేదీ నుంచి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి.
- విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు జూన్ 20వ తేదీ నుంచి పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమం మొదలయింది.
- ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు రాయడం, చదవడం రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని రూపొందించి, అమలు చేపట్టింది. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థులకు ఉచితంగా వర్క్‌బుక్కులు పంపిణీ చేశారు.
- సెప్టెంబర్ 6న జిల్లా నూతన డీఈఓగా వెంకటేశ్వరాచారి బాధ్యతలు చేపట్టారు.
- సెప్టెంబర్ 7 నుంచి ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రక్రియ ప్రారంభమైంది.
- సెప్టెంబర్‌లో ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన చేయగా, జిల్లాలో 180 వరకు ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.
- సెప్టెంబర్ 15వ తేదీ నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఫేషియల్ యాప్ ద్వారా అటెండెన్స్ తీసుకుంటున్నారు.



ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియపై సూచనలు చేస్తున్న విద్యాశాఖ జేడీ వెంకటనర్సమ్మ



నూతన యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

- అక్టోబర్ 5న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు.
- అక్టోబర్ 6వ తేదీ నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం సమయంలో అల్పాహార పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది.
- నవంబర్ 17న జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు.
- డిసెంబర్ 19వ తేదీ నుంచి పాల్వంచలో జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాలతో తాత్కాలికంగా రద్దు చేశారు. ఆన్‌లైన్‌లో వచ్చే జనవరిలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం కరోనా కేసులు సైతం పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.
- సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమంలో పలువురు ఉద్యోగుల నియామకం చేపట్టారు.

సింగరేణిలో సత్తా

చివరి నిమిషంలో ఎన్నికలపై పొంగులేటి దృష్టి

- ఒక్కరోజులో నాలుగు ఏరియాల్లో సుడిగాలి పర్యటన
- అన్నింటా ఐఎన్‌టీయూసీ విజయ కేతనం
- పత్తాలేకుండా పోయిన టీబీజీకేఎస్



ఐఎన్‌టీయూసీ శ్రేణుల హర్షాతిరేకాలు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కోల్‌బెల్ట్ ఏరియాలో తనకున్న పట్టును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ – ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. ఐఎన్‌టీయూసీ గెలుపును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ శతవిధాల ప్రయత్నించినా పొంగులేటి వ్యూహాల ముందు అవి పారలేదనే అభిప్రాయం నెలకొంది. గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాలు సైతం అందుకు బలమైన ఉదాహరణగా నిలుస్తున్నాయి.

గత ఎన్నికల్లో పోటీకి దూరం

సింగరేణిలో ఆది నుంచి సీపీఐ – ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బలమైన సంఘంగా కొనసాగుతూ వస్తోంది. ఇప్పటివరకు నాలుగుసార్లు గుర్తింపు సంఘంగా విజయం సాధించింది. ఏఐటీయూసీకి పోటీగా ఐఎన్‌టీయూసీ తీవ్రంగా పోరాడినా కేవలం ఒక్కసారే గుర్తింపు సంఘం హోదాను దక్కించుకోగలిగింది. ముఖ్యంగా 2009 నుంచి ఐఎన్‌టీయూసీ క్రమంగా బలహీనపడుతూ ఆ స్థానంలో బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ బలపడుతూ వచ్చింది. 2012 నుంచి 2023 డిసెంబరు 27 వరకు గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ ప్రభ నడిచింది. టీబీజీకేఎస్ అనుకూల పవనాలతో 2017లో ఐఎన్‌టీయూసీ పోటీ కూడా చేయకుండా ఏఐటీయూసీకి మద్దతు ఇవ్వడంతో సరిపెట్టుకుంది.

కలిసి వచ్చిన అసెంబ్లీ ఎన్నికల గెలుపు

పొంగులేటి రాకతో ఐఎన్‌టీయూసీ క్రమంగా బలం పుంజుకుంది. దీనికితోడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం మరింతగా కలిసి వచ్చింది. అయినప్పటికీ ఇటు బీఆర్ఎస్ , అటు కాంగ్రెస్ పార్టీలు సింగరేణి ఎన్నికలపై పెద్దగా దృష్టి సారించలేదు. పూర్తిగా కార్మిక సంఘాల నాయకత్వానికే వదిలేశాయి. అయితే ఈ నెల 27న పోలింగ్ ఉండగా ఈ నెల 21వ తేదీ వరకు ఎన్నికలు జరుగుతాయా లేదా అనే సందిగ్ధ పరిస్థితి నెలకొంది. ఎన్నికల వాయిదా కుదరదని తేలాక ఒక్కసారిగా సమీకరణాలు మారాయి. కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు ఏఐటీయూసీకి టీబీజీకేఎస్ మద్దతు ఇస్తుందనే ప్రచారం ముమ్మరంగా సాగింది. దీని ప్రతివ్యూహంగా మంత్రి పొంగులేటి స్వయంగా రంగంలోకి దిగారు. పావులు కదపడం ప్రారంభించారు.

ఒక్క రోజు ప్రచారంతో..

గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం చివరి రోజు డిసెంబరు 25న మంత్రి పొంగులేటి ప్రచారంలో పాల్గొన్నారు. ఉదయం ఇల్లెందు నుంచి మొదలుపెట్టి కొత్తగూడెం, కార్పొరేట్, మణుగూరులో ప్రచారం నిర్వహించి రాత్రి వేళ సత్తుపల్లికి చేరుకుని అక్కడ కూడా ఐఎన్‌టీయూసీ గెలుపు కోసం సుడిగాలి పర్యటన చేశారు. 2017లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలను పొంగులేటి స్వయంగా పర్యవేక్షించడంతో కార్మికుల సమస్యలపై అవగాహనతోపాటు నేతలతో ఉన్న విస్తృత పరిచయాలు తోడ్పాటును అందించాయి. ఫలితంగా తక్కువ సమయంలో జిల్లాలోని నాలుగు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ గెలుపునకు బాటలు వేయగలిగారు. అంతేకాదు భూపాలపల్లి ఏరియాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ అక్కడ కూడా ఐఎన్‌టీయూసీని గెలిపించగలిగారు. గతంలో జరిగిన రెండు ఎన్నికల్లో ఈ ఏరియాలో ఏఐటీయూసీ విజయం సాధించింది.

స్పష్టమైన ఆధిక్యం

2017లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ జిల్లాలోని నాలుగు ఏరియాల్లో కలిపి 6,267 ఓట్లను సాధించింది. ఇదే సమయంలో ఏఐటీయూసీ 2,914 ఓట్లను పొందింది. కానీ తాజా ఎన్నికల్లో ఈ రెండు సంఘాలకు జిల్లాలో చుక్కెదురైంది. టీబీజీకేఎస్ దారుణంగా నాలుగు ఏరియాల్లో కలిపి 796 ఓట్లను సాధించింది. ఇందులో ఒక్క మణుగూరులోనే 728 ఓట్లు రాగా మిగిలిన మూడు ఏరియాల నుంచి డెబ్బై ఓట్లు వచ్చాయి. మరోవైపు ఏఐటీయూసీకి సైతం గతాని కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. బలంగా ఉన్న ఏఐటీయూసీ రెండో స్థానానికి వెళ్లగా టీబీజీకేఎస్ పత్తా లేకుండా పోయినట్లయింది.

నేడు జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం కోర్టులో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీ పడదగిన యాక్సిడెంట్, ఘర్షణ, చీటింగ్, చిట్‌ఫండ్, భూ తగాదాల కేసులు, వివాహ బంధం, చిన్న చిన్న చోరీలు, ట్రాఫిక్ చలానా, కుటుంబ తగాదాలు, బ్యాంకు, టెలిఫోన్ కేసుల విషయంలో లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదాయం, లోకల్ సర్టిఫికెట్లు అవసరం లేదు

- ఆధార్‌కార్డులో ఆంధ్రప్రదేశ్ ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చు
- ప్రజాపాలన దరఖాస్తుల సందేహాలపై కలెక్టర్ స్పష్టత



కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాపాలన దరఖాస్తులకు ఆదాయం, లోకల్ ఏరియా సర్టిఫికెట్లు జతపర్చాల్సిన అవసరంలేదని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్న సందేహాలపై శుక్రవారం ఆమె స్పష్టతనిచ్చారు. ఆధార్‌కార్డుల్లో ఆంధ్రప్రదేశ్ అని ఉన్నా మార్చాలిన అవసరం లేదని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటో సరిపోతాయని పేర్కొన్నారు. ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్, ఖమ్మం జిల్లా ఉంటే దరఖాస్తులు తీసుకోరని, ఆదాయం, కుల ధ్రువీకరణపత్రాలు అడుగుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మవద్దని సూచించారు. సందేహాలు ఉంటే ప్రజలు హెల్ప్‌డెస్క్‌ను, రెవెన్యూ, ఎంపీడీఓ, ఎంపీఓ, గ్రామకార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళాస్వయం సహాయక సంఘ సభ్యులను సంప్రదించాలని వివరించారు. అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్‌రూం 08744–241950కు కార్యాలయ పనివేళల్లో ఫోన్ చేయాలని చెప్పారు. రెండో రోజు 74 గ్రామ పంచాయతీల్లో, మూడు మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించామని తెలిపారు. 34,995 గృహాల లబ్ధిదారుల నుంచి 44,711 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తోందని తెలిపారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు బాధ్యతగా రశీదు అందజేయడంతోపాటు ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి దరఖాస్తులను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. జిరాక్స్ కాపీలకు అధిక ధరలు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, సంబంధిత జిరాక్స్ కేంద్రం అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా ఎక్కువ వసూలు చేస్తే తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. 30న గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీలలో షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు.

రామయ్యకు 'పుష్యమీ' పట్టాభిషేకం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం పుష్యమీ నక్షత్రం, శ్రీరామ మాలధారణ విరమణ మరుసటి రోజు సందర్భంగా పట్టాభిషేక మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని, అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అంతరాలయంలో స్వర్ణ కవచధారులైన స్వామివారి మూలమూర్తులను దర్శించుకుని భక్తులు పరమానందభరితులయ్యారు.



పట్టాభిషేక క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రాపత్తు సేవ

దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రామయ్యకు రాపత్తు సేవ నిర్వహించారు. తొలుత పల్లకీలో స్వామివారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా ఉదయ్‌భాస్కర్ రోడ్డు వద్ద ఉన్న మండపానికి తీసుకొచ్చారు. ఇక్కడ రామయ్య స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతిని సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నర్సింహారావు, ఇతర సిబ్బంది, ఆలయ అర్చకులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై కేంద్ర బృందం ఆరా



నాగినేనిప్రోలు హెల్త్ సబ్‌సెంటర్ వద్ద వీబీఎస్‌వై బృందం ప్రతినిధులు

బూర్గంపాడు /దుమ్ముగూడెం: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర (వీబీఎస్‌వై) కేంద్ర బృందం శుక్రవారం జిల్లాలో పర్యటించింది. బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను, దుమ్ముగూడెం మండలం నర్సాపురం పీహెచ్‌సీ పరిధిలోని సుబ్బారావుపేటలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించింది. రోగులకు అందుతున్న వైద్యసేవలపై బృందం ప్రతినిధులు ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్యారోగ్య పథకాల అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీబీ, బీపీ, షుగర్ బాధితులకు, గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. శిబిరంలో రక్త, సికిల్ సెల్, బీపీ, షుగర్, టీబీ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బృందం ప్రతినిధులు అఖిల్ అగర్వాల్, కమల్, జేవీ శ్రీనివాసరావు, మధువరన్, చైతన్య, దుర్గ, లక్ష్మీసాహితి, సుభాష్, సుబ్బారావుపేట సర్పంచ్ వర్సా చిన్నారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొదలైన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉండగా ఫిబ్రవరి 24న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. ఫిబ్రవరి 24నుంచి మార్చి 14వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. కాగా, కొత్త ఓటరు జాబితాలో పేరు నమోదైతే ఓటు వేసే అవకాశం లభిస్తుంది.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ (మాస్టర్స్) పోటీలను ఈ నెల 31వ తేదీ (ఆదివారం) నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ గోపీచందర్, జనరల్ సెక్రటరీ సముద్రాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా వారు మాట్లాడారు. ప్రకాశం స్టేడియంలో నిర్వహించే పోటీల్లో 35 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చని, పరుగు పందెం - 100, 200, 400, 800, 1500 మీటర్లతోపాటు 5 కిలో మీటర్లు ఉంటుందని, నడక - 3 కి.మీ, 5 కి.మీ, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హ్యామర్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. పాల్గొనాలనుకునే వారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్ తీసుకుని ఎంట్రీ ఫీజుతో 31వ తేదీ ఉదయం 10 గంటల వరకు ప్రకాశం స్టేడియానికి చేరుకోవాలని, పూర్తి వివరాల కోసం 98491 46336 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో చల్లగుండ్ల నాగయ్య, చంద్రకళ, చల్లగుండ్ల కృష్ణయ్య, పారా మోహన్, ప్రసాద్‌రెడ్డి, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ పంకజ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించి అధికారులు ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలను భద్రాచలం ఏఎస్పీ పారితోష్ పంకజ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేంద్రాల్లో ఎవరైనా ఘర్షణలకు దిగినా, ప్రజల్లో ఆందోళన కలిగించే విధంగా ప్రవర్తించినా వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ నాగరాజు, ఎస్‌ఐ మధుప్రసాద్ పాల్గొన్నారు.

చిన్న మొత్తాల పథకాలపై వడ్డీ రేట్ల సవరణ

ఖమ్మంగాంధీచౌక్: చిన్న మొత్తాల పథకాలపై నాలుగో త్రైమాసికంలో వడ్డీరేట్లను సవరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు ఈ మార్పు అమల్లోకి వస్తుంది. సుకన్య సమృద్ధి యోజన పథకంలో వడ్డీని 8 నుంచి 8.2 శాతానికి పెంచగా, ఏడాది సేవింగ్ డిపాజిట్‌పై 6.9 శాతం, రెండేళ్ల డిపాజిట్‌పై 7 శాతం, మూడేళ్ల డిపాజిట్‌పై 7.1 శాతం, ఐదేళ్ల సేవింగ్ డిపాజిట్‌పై 7.5 శాతంగా వడ్డీరేట్లను సవరించారు. అలాగే, నెలవారీ ఆదాయ ఖాతా పథకంలో 7.4 శాతం , నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు 7.7 శాతం, పబ్లిక్ ప్రావిడెంట్ పథకానికి 7.1 శాతంగా సవరిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నలుగురిపై కేసు

పాల్వంచరూరల్: భూ వివాదంలో ఘర్షణ పడిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బానోత్ వలమ భూమి ఆక్రమణ విషయమై శుక్రవారం సుమన్, శ్రీను, సాయి, దీప ఘర్షణ పడ్డారు. తన చేతిని కొరికి తనపై దాడి చేశారని వలమ ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై..

సుజాతనగర్: కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై సుజాతనగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సోమేశ్వర్ కథనం మేరకు.. సీతంపేట గ్రామానికి చెందిన సాధం కృష్ణయ్యతో అతడి కుమారుడు వెంకటనర్సింహారావు గొడవపడ్డాడు. దీంతో కృష్ణయ్య 100కు డయల్ చేశాడు. విచారణ నిమిత్తం కానిస్టేబుల్ నరేశ్ అక్కడికి వెళ్లి సర్ది చెబుతుండగా అతడిపై కూడా దాడికి పాల్పడ్డాడు. తన విధులను అడ్డుకున్నాడని కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుపై వెంకటనర్సింహారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

బాలికల పోరు భళా..

- హోరాహోరీగా గిరిజన గురుకులాల క్రీడాపోటీలు
- అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఖమ్మం, ఆదిలాబాద్ జోన్లు



పోటాపోటీగా కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఇల్లెందురూరల్: విజయమే లక్ష్యంగా అత్యుత్తమ ప్రదర్శనతో బాలికలు ఆకట్టుకుంటున్నారు. జట్టును విజయతీరాలకు చేర్చేందుకు హోరాహోరీగా తలపడుతున్నారు. ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న గిరిజన గురుకులాల రాష్ట్రస్థాయి పోటీలు శుక్రవారం రెండోరోజుకు చేరాయి. రాష్ట్రంలోని ఆదిలాబాద్, , కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జోన్ల నుంచి 1,200 మంది క్రీడాకారిణులు హాజరుకాగా 28 ఈవెంట్లలో సత్తా చాటుతున్నారు. అథ్లెటిక్స్ పోటీలు రెండు రోజుల్లోనే ముగియగా ఇతర క్రీడాంశాలు తుదిదశకు చేరాయి. అథ్లెటిక్స్ ఈవెంట్లలో ఆదిలాబాద్, ఖమ్మం జోన్ల క్రీడాకారులు నువ్వా-నేనా అన్నట్లు తలపడగా ఖమ్మం జోన్ ఎనిమిది ఈవెంట్లలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జోన్ ఏడు ఈవెంట్లలో ప్రథమ స్థానంలో నిలవగా, అథ్లెటిక్స్ పోటీల విజేతల వివరాలను నిర్వాహకులు ప్రకటించారు.

అండర్ - 14 విభాగంలో..

పరుగు పందెం 100 మీటర్లలో జె.సాత్విక (అన్నపురెడ్డిపల్లి), కె.రమ్యశ్రీ(కొత్తగూడెం), ఎస్.పావనిశ్రీ (కాటారం), 400 మీటర్లలో ఎ.నక్షత్ర (ఎల్లారెడ్డి), జె.సాత్విక (అన్నపురెడ్డిపల్లి), బి.అనూష (అన్నపురెడ్డిపల్లి), 600 మీటర్లలో కె.సునీత (ఎల్లారెడ్డి), ఆర్.అంజలి (దేవరకొండ), ఎం.జ్యోతిక (ఆసిఫాబాద్), షాట్‌పుట్‌లో జె.సాత్విక (అన్నపురెడ్డిపల్లి), జానుబాయి (ఆసిఫాబాద్), ఆర్.కల్యాణి (దేవరకొండ), డిస్కస్‌త్రోలో జె.సాత్విక (అన్నపురెడ్డిపల్లి), కె.ప్రణీత (భద్రాచలం), వి.జ్యోతి (మహబూబ్‌నగర్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

అండర్ - 17 విభాగంలో..

పరుగు పందెం 100 మీటర్లలో పి.ఇందు (భద్రాచలం), సీహెచ్ సబిత(కొత్తగూడెం), ఎ.వైష్ణవి (ఇచ్చోడ), 400 మీటర్లలో ఎల్.నందిని (ఎల్లారెడ్డి), పి.ఇందు (భద్రాచలం), ఈ.సింధు (పరిగి), 800 మీటర్లలో ఎ.వైష్ణవి (ఇచ్చోడ), ఎం.వర్షిత (వైరా), ఎల్.సునీత (ఎల్లారెడ్డి), షాట్‌పుట్‌లో బి.రాజేశ్వరి (వైరా), పి.ఇందు (భద్రాచలం), బి.పల్లవి (ఇందలవాయి), 1,500 మీటర్లలో కె.నందిని (ఎల్లారెడ్డి), ఆర్.సింధు (దేవరకొండ), వి.సాక్షి(తాండూరు), డిస్కస్‌త్రోలో పి.ఇందు (భద్రాచలం), ఆర్.రషిక (ముథోల్), ఎ.శ్రీవర్ష (కాటారం) మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు.

అండర్ - 19 విభాగంలో..

పరుగు పందెం 100 మీటర్లలో టి.శ్రీతేజ (భద్రాచలం), కె.దుర్గాభవాని(ఆసిఫాబాద్), ఈ.నిఖిత (ఏటూరునాగారం), 400 మీటర్లలో టి.శ్రీతే(భద్రాచలం), ఎల్.అఖిల (ఎల్లారెడ్డి), నందిని (కాటారం), 800 మీటర్లలో టి.వర్షిత (ఎల్లారెడ్డి), టి.వర్షిత (అంకంపాలెం), బి.శివాని (ఆసిఫాబాద్), 1,500 మీటర్లలో ఎల్.అఖిల (ఎల్లారెడ్డి), పి.వైశాలి (అంకంపాలెం), జె.శ్రీలేఖసాయి (అచ్చంపేట) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.



ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజల బాగోగులే నా మొదటి అజెండా
- 'ప్రజాపాలన'లో అందరికీ న్యాయం
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

హలో ఎమ్మెల్యే



మాలోతు రాందాస్ నాయక్

వైరా: నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించడమే కాక పాలనలో ఇబ్బందులు రాకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కృషిచేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. పల్లె, పట్టణం, మారుమూల తండాలనే తేడా లేకుండా సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఎన్నో ఆశలతో తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని.. సమస్యల పరిష్కారం ద్వారా వారికి కృతజ్ఞతలు చెప్పుకుంటానని తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనతో ప్రజలు నేరుగా మాట్లాడి సమస్యలు చెప్పుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన శుక్రవారం 'హలో ఎమ్మెల్యే' పేరిట ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా మంచి స్పందన లభించింది. సుమారు వంద మందికి పైగా ఫోన్ చేయగా ఎమ్మెల్యే 30 మందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన వచ్చినందున ప్రతీ పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యమని తెలిపారు. గత పదేళ్లలో గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేని, ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ఈమేరకు ప్రజల్లో కొందరు అడిగిన ప్రశ్నలు, ఎమ్మెల్యే ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: జూలూరుపాడులో శాశ్వత వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి. గతంలో స్థలం కేటాయించినా నిర్మాణం చేపట్టలేదు. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది.
– వేల్పుల నర్సింహారావు, జూలూరుపాడు

ఎమ్మెల్యే : రెవెన్యూ అధికారులతో మాట్లాడి యార్డు నిర్మాణమయ్యేలా చూస్తాను. త్వరలో రెండు శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తాం.

ప్రశ్న : చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీలు లేక సమస్యలు ఎదురవుతున్నాయి.
– సూర్య, నూకలంపాడు / ఎల్.గోపాల్‌రావు తనికెళ్ల / రామకృష్ణ, కారేపల్లి

ఎమ్మెల్యే : చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీలు నిరిమంచలేదు. తప్పకుండా పూర్తి స్థాయిలో డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టేలా అవసరమైన నిధులు మంజూరు చేయిస్తా.

ప్రశ్న : పట్టాలు ఇచ్చిన పోడు భూముల్లో బోర్లు వేయిస్తే మా సమస్య పరిష్కారమవుతుంది.
– రాంబాబు, మాణిక్యారం / బాలు, వినోభానగర్ / నారపోగు నాగరాజు, కేజీ సిరిపురం

ఎమ్మెల్యే : పోడుభూములకు పట్టాలిచ్చే కార్యక్రమం చేపట్టి ఆ భూముల్లో బోర్లు వేయిస్తాం. ఐటీడీఏ ద్వారా గిరిప్రభ పథకం ద్వారా బోర్లు వేయించే కార్యక్రమం త్వరలోనే చేపడతా.

ప్రశ్న : జూలూరుపాడులో 30 పడకల ఆస్పత్రి ఉన్నా వైద్యం అందడం లేదు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయించి వైద్యసేవలు అందేలా చూడండి.
– పి.నాగరాజు, జూలూరుపాడు

ఎమ్మెల్యే : ఆస్పత్రి అప్‌గ్రేడ్‌పై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడతాను. అవసరమైతే ఆరోగ్యశాఖ మంత్రికి సమస్యను తీసుకెళ్తా.

ప్రశ్న : మా గ్రామంలో శివాలయానికి తొమ్మిది ఎకరాల భూమి ఉన్నా ఆలయ అభివృద్ధి జరగడం లేదు.
– ఏ.రాంబాబు, పాపకొల్లు

ఎమ్మెల్యే : దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి ఆలయ అభివృద్ధితో పాటు నిత్యపూజలు జరిగేలా ఏర్పాట్లు చేయిస్తాం.

ఉన్న ఆధార్‌కార్డుతోనే దరఖాస్తు చేసుకోండి



చంద్రుగొండ: పోకలగూడెం గ్రామసభలో మాట్లాతున్న అదనపు కలెక్టర్ రాంబాబు



జూలూరుపాడు: ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

- జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు
- ప్రజాపాలన గ్రామసభల పరిశీలన

కొత్తగూడెంఅర్బన్/చంద్రుగొండ/జూలూరుపాడు/టేకులపల్లి: ప్రస్తుతం మీ వద్ద ఉన్న ఆధార్‌కార్డుతోనే ప్రజాపాలన ఆరు గ్యారెంటీల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కొత్తగూడెం మున్సిపాలిటీ, చంద్రుగొండ, జూలూరుపాడు, టేకులపల్లి మండలాల్లో పలు ప్రజాపాలన గ్రామసభలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో ఉమ్మడి జిల్లా పేరు ఉన్నప్పటికీ దరఖాస్తులకు ఇబ్బంది లేదన్నారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తు ఫారాలు ఇంటింటికీ ఉచితంగా పంపిణీ చేస్తామని, డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. దరఖాస్తుల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, తనిఖీ చేశాకనే దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను నింపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా జూలూరుపాడు మండలం గుండెపుడి ప్రజాపాలన గ్రామసభను జెడ్పీ సీఈఓ విద్యాలత దరఖాస్తులను స్వీకరించి ప్రారంభించారు. కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు మాట్లాడుతూ 1,5, 9,13, 17, 21, 25, 29, 33 వార్డుల్లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో రెండో రోజు 1,759 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీఓ శిరీష, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వార్డు కౌన్సిలర్ అనిల్, జూలురుపాడు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఐటీడీఏ ఏఈ మీనా, పశుసంవర్ధకశాఖ జేడీఓ పూర్ణచందర్‌రావు, టేకులపల్లి తహసీల్దార్ కృష్ణవేణి, సీడీపీఓ కె.ఎం.తార, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ప్రజావాణిలో ఫిర్యాదు

చుంచుపల్లి: మండలంలోని ప్రశాంతినగర్ పంచాయతీలో బృహత్ పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించిన 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి, అక్రమంగా గుడిసెలు వేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం అదే గ్రామానికి చెందిన హరి హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో ఆ కబ్జాదారుల నుంచి రెవెన్యూ, పోలీస్ సహకారంతో గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకుందని, దానిలో మొదట పల్లె ప్రకృతివనం నిర్మించినారని తెలిపారు. అక్కడ కేటాయించిన సుమారు 5 ఎకరాల భూమి గ్రామపంచాయతీ ద్వారా లక్షలు ఖర్చుపెట్టి శుభ్రం చేసి కొన్ని మొక్కలు నాటుతున్న క్రమంలో మళ్లీ కొందరు పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, పంచాయతీ సిబ్బందిపై ఎదురు దాడులు చేయడానికి తెగబడ్డారని దరఖాస్తులో పేర్కొన్నారు. కొందరు ప్రజా ప్రతినిధుల అండదండలతో యథేచ్ఛగా ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్నారని, ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి పంచాయతీకి అందించాలని, కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

హోరాహోరీగా నెహ్రూ కప్ క్రికెట్ టోర్నీ



'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అందజేస్తున్న కోటేశ్, జిందా

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నెహ్రూ కప్ (తాళ్లూరి భారతీదేవి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ) పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన మ్యాచుల్లో కొత్తగూడెం న్యూస్టార్, భద్రాచలం బెస్ట్ క్రికెట్ అకాడమీ, పాల్వంచ చేజింగ్ లెవన్ జట్లు గెలుపొందాయి. తొలి మ్యాచ్‌లో ఎస్ఆర్ లెవన్ జట్టుతో న్యూస్టార్స్ జట్టు తలపడగా న్యూస్టార్స్ విజయం సాధిచింది. ఈ మ్యాచ్‌లో 50 పరుగులు చేసిన యుగంధర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కేఎస్ఆర్ మార్ట్ వ్యవస్థాపకులు నాగరాజు అందించారు. రెండో మ్యాచ్‌లో ఏఎస్‌సీ లెవెన్ జట్టుపై బెస్ట్ క్రికెట్ అకాడమీ జట్టు గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన నాగికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఆర్‌కే షాపింగ్ మాల్ వ్యవస్థాపకులు దొడ్డిపట్ల కోటేశ్వరరావు, బ్లడ్ డొనేషన్ సభ్యులు జిందా అందజేశారు. మూడో మ్యాచ్‌లో ప్రతాప్ లెవెన్ జట్టుపై పాల్వంచ చేజింగ్ లెవెన్ జట్టు గెలుపొందగా, 19 బంతుల్లో 34 పరుగులు చేసిన ఈశ్వర్‌కు నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమళ్ల బాలయోగి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో మడిపల్లి నాగార్జున, ఎస్‌కే సలీం, కుంచాల సదానందం, ఎస్‌కే అజీం, తిరుమల్‌రావు, బి.చందు, కావూరి గోపి, పాషా తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాలపై దాడులు అమానుషం



గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

మణుగూరురూరల్: మండలంలోని వాసవీనగర్, మణుగూరు ప్రాథమిక పాఠశాల, శివలింగాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లోని గాంధీ విగ్రహాలపై కొందరు గుర్తుతెలియని దుండగులు దాడి చేయడం అమానుషమని వాసవీక్లబ్ సభ్యులు, ప్రతినిధులు, ఇతర స్వచ్ఛంద సంస్థల బాధ్యులు అన్నారు. శుక్రవారం వాసవీక్లబ్ సభ్యులు వాసవీనగర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలన నుంచి స్వాతంత్య్రం సాధించేందుకు పోరాడిన అగ్రగన్యుడు మహాత్మాగాంధీ అన్నారు. గాంధీజీ విగ్రహాలపై దుండగులు రాళ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. అనంతరం మణుగూరు ఎస్‌ఐ రాజేశ్‌కు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో దోసపాటి నాగేశ్వరరావు, కత్తి రాము, విశ్వనాథగుప్తా, చిత్తలూరి రమేశ్‌బాబు, బండారు నర్సింహారావు, కేఆర్ ప్రసాద్, మిట్టపల్లి శ్యామ్, వందనపు వాసు, వారణాసి అరవింద్, కె.నాగరాజు, డి.హనుమంతు, నరేంద్ర, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌యార్డు వద్దంటూ స్థానికుల నిరసన



కోల్‌యార్డు వద్ద మాట్లాడుతున్న బాధితులు

టేకులపల్లి: మండలంలోని తావుర్యాతండా పంచాయతీ తడికలపూడి రైల్వేస్టేషన్ వద్ద కోల్‌యార్డు ఏర్పాటు చేయొద్దని సమీప గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. 2002 నుంచి కేటీసీ నుంచి బొగ్గును లారీల ద్వారా కోల్‌యార్డుకు తరలించి అక్కడి నుంచి వ్యాగన్ల ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా చేసేవారు. దీంతో దుమ్ము, ధూళి కారణంగా ఈర్యాతండా, తావుర్యాతండా గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతుండేవారు. ఈ క్రమంలో స్థానికులు అనేక పర్యాయాలు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఆందోళనలు కూడా చేశారు. దీంతో ఏడాది కిందటే తడికలపూడి రైల్వేస్టేషన్ వద్ద ఉన్న కోల్‌యార్డుకి కేటీసీ నుంచి బొగ్గు సరఫరా నిలిపివేశారు. తాజాగా బొగ్గు రవాణాకు టెండర్ పిలవడంతో ఆ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ శుక్రవారం వ్యాగన్ల నుంచి బొగ్గును యార్డులోకి డంప్ చేస్తున్న క్రమంలో విషయం తెలుసుకున్న రెండు గ్రామాల ప్రజలు స్థానిక సర్పంచ్ తేజావత్ రమేశ్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రమణారెడ్డి చేరుకుని శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలని నచ్చజెప్పారు. కార్యక్రమంలో బానోత్ రమేశ్, బానోత్ వీరన్న, సిరి, మోహన్, మోతి, విజయ, ఇందు, పార్వతి, బాలాజీ, సురేశ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళా కానిస్టేబుల్ మృతి

భర్తే ఉరివేసి హత్య చేశాడంటున్న మృతురాలి బంధువులు



స్వాతి (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ బాలాజీనగర్‌లో నివాసముంటూ భద్రాది కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మీగడ స్వాతి (29) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఖమ్మం అర్బన్ ఎస్‌ఐ పి.వెంకన్న కథనం ప్రకారం.. స్వాతి రెండేళ్ల కిందట ఖమ్మంలో విధులు నిర్వర్తిస్తున్న సమయాన రాజీవ్‌నగర్‌గుట్టకు చెందిన కారుడ్రైవర్ ప్రవీణ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. కొన్ని నెలలు పాటు దాంపత్య జీవితం సజావుగానే సాగింది. వీరికి 19 నెలల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వరకట్నం తీసుకురావాలని ప్రవీణ్ వేధిస్తుండడంతో స్వాతి అప్పు చేసి రూ.9 లక్షలు, తండ్రి నుంచి మరో రూ.14 లక్షలకు పైగా ఇప్పించింది. అయినా సంతృప్తి చెందని ప్రవీణ్ మద్యం సేవిస్తూ ఏపని చేయకుండా నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలోనే గురువారం ఇంట్లో స్వాతి, ప్రవీణ్ ఘర్షణ పడినట్లు తెలుస్తుండగా పెద్దగా శబ్దాలు వచ్చాయని స్థానికులు తెలిపారు. దీంతో సమీపంలోనే ఉండే స్వాతి సోదరి కవిత వచ్చేసరికి స్వాతి కిందపడుకుని, ఉందని, ఏమైందని ఆరా తీస్తే ఉరి వేసుకుందని ప్రవీణ్ చెప్పాడని కవిత వెల్లడించింది. అనంతరం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. కాగా, ప్రవీణ్ ఉరి వేసి స్వాతిని హత్య చేసినట్లు తమకు అనుమానాలు ఉన్నాయని కవిత ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళా కానిస్టేబుల్‌కు నివాళి

ముదిగొండ: భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ మీగడ స్వాతి ఖమ్మంలో గురువారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన ముదిగొండ గోకినేపల్లికి శుక్రవారం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఎస్‌ఐలు సంతోష్, నరేశ్, పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి జానీమియా తదితరులు స్వాతి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం మేరకు.. ఇల్లెందు మండలం రొంపేడుకు చెందిన మల్టీపర్పస్ వర్కర్ పాదం సాయికుమార్(29), ఆయన భార్య అనూష, మూడేళ్ల కూతురు నోహిత.. వారి బంధువు రాజమండ్రికి చెందిన ఉప్పాళ్ల ప్రవీణ్ ఇల్లెందు నుంచి గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై భద్రాచలం బయలుదేరారు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు సమీపంలోకి రాగానే వేగంగా దూసుకొచ్చిన ట్రాలీ బైక్‌ని ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న నలుగురూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. సాయికుమార్ తల, కాలుకి గాయాలు కాగా మిగతావారి కాళ్లకు గాయాలయ్యాయి. వారిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంకు, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఉస్మానియాలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సాయికుమార్ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మిగిలిన ముగ్గురూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

పాల్వంచరూరల్: రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొట్టిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. కొత్తగూడెం శ్రీనగర్ కాలనీకి చెందిన కొత్వాల నళిని – ఉమామహేశ్వరరావు దంపతులు ఈనెల 16న నవభారత్ వద్ద రోడ్డు దాటుతుండగా కొత్తగూడెం నుంచి పాల్వంచ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో నళినికి తీవ్రగాయాలు కాగా ఆమె భర్త శుక్రవారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య

పాల్వంచరూరల్: టీబీతో బాధపడుతున్న ఓ వ్యక్తి తీవ్ర మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మల్లారంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈసం ప్రభాకర్ (46) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా టీబీ జబ్బుతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. పక్కింటి వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ప్రభాకర్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సుజాతనగర్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. సుజాతనగర్‌కు చెందిన కన్నెదేవర మాధవరావు దంపతులు 15 రోజుల కిందట ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. దంపతులు తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 6 తులాల పట్టీలు, దిద్దులు, పుస్తెలు, అరతులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీపై పోలీసులు వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.